సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం ၊ 12 ၊ ఆగస్టు ၊ 2023



విజిలెన్స్ దాడులు
కడపలోని కిరణ్ టిఫిన్ అండ్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను కడప విజిలెన్స్ అధికారులు, పౌరసరఫరాల సంస్థ డిప్యూటీ తహసీల్దార్ శుక్రవారం తనిఖీ చేశారు. -10లో



సీఎం సహాయ నిధి పేదలకు వరం
ముఖ్యమంత్రి సహాయ నిధి.. నిరుపేదలకు వరమని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్ బాషా అన్నారు. -10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 31.5/23.8
జిల్లాలో శుక్రవారం 23.8 – 31.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

22న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు జెడ్పీలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్ ఉమ్మడి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అధికారులు ఆ రోజు ఉదయం 9 గంటలకే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డీపీఈడీ, బీపీఈడీ కోర్సుకు సంబంధించిన తృతీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ విడుదల చేశారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డిలతో కలిసి వీసీ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జూలై నెలలో నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ఫలితాల్లో డీపీఈడీ ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. బీపీఈడీ ఫలితాల్లో 84.87 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డా. ఆదినారాయణరెడ్డి, డా. సుమిత్ర పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో రెండో విడత డిగ్రీ ప్రవేశాలు

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ప్రవేశాల కోసం రెండోవిడత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల ఆనర్స్ డిగ్రీ కోర్సులలో ప్రవేశాల నిమిత్తం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు వచ్చేవారంలో ఆప్షన్స్ ఇచ్చుకోవచ్చని సూచించారు. మొదటి విడతలో ఆప్షన్స్ ఇవ్వని వాళ్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్ 9177682848, ప్రవేశాల సమన్వయకర్త టి. మనోహర్‌రెడ్డి 8919818677 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష(ఎన్‌ఎంఎంఎస్)–2023కు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. సంబంధిత పరీక్షను డిసెంబర్ 3వ తేదీ జిల్లాలోని రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష రాయడానికి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యంలేని ఆదర్శ పాఠశాలల్లో ఈ సంవత్సరం 8వ తరగతి చదువుతూ కుటుంబ ఆదాయం రూ. 3,50,000 లోపు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పరీక్ష రుసుం జనరల్, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 50 చెల్లించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈ నెల 10వ తేదీ నుంచి అందుబాటులో ఉన్నాయన్నారు. దరఖాస్తు చేయడానికి చివరి తేదీ సెప్టెంబర్ 15 అని తెలిపారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ పరీక్షలు సంచాలకు కార్యాలయం వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో లేదా డీఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

కాల్ సెంటర్ ఆధారిత సేవలకు..

కడప సెవెన్‌రోడ్స్: కలెక్టర్ కార్యాలయంలో క్లౌడ్ బేస్డ్ కాల్ సెంటర్ సర్వీసు ఆధారిత సేవలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జేసీ గణేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల ఐటీ సంస్థలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 11 నుంచి 18వ తేది మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్‌లో దరఖాస్తులు లభిస్తాయన్నారు. దరఖాస్తు కోసం రూ. 5 వేలు జాయింట్ కలెక్టర్ పేరిట డీడీ చెల్లించాలన్నారు. పూరించిన దరఖాస్తులను 18వ తేది మధ్యాహ్నం 3 గంటల్లోపు సమర్పించాలన్నారు. 19వ తేదీ సాయంత్రం 4.00 గంటలకు టెండర్లు తెరుస్తామని చెప్పారు.

నలుగురు బీఎల్‌ఓలపై సస్పెన్షన్ వేటు

కడప సెవెన్‌రోడ్స్: విధి నిర్వహణలో అలసత్వం వహించిన నలుగురు బీఎల్‌ఓలను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024కు సంబంధించి జిల్లాలో చేపడుతున్న ఇంటింటి సర్వే విధుల్లో తీవ్ర అలసత్వం వహించినందుకుగాను పులివెందుల నియోజకవర్గానికి చెందిన బీఎల్‌ఓలు కె.అజయ్ కుమార్ రెడ్డి (పులివెందుల), ప్రవీణ్ కుమార్ (తొండూరు మండలం), గిరిధర్ రెడ్డి (తొండూరు మండలం), రాధ (వేంపల్లె మండలం)లను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ శుక్రవారం సాయంత్రం ఆర్డర్ కాపీలను జారీ చేశారు. ఇంటింటి సర్వేకి సంబంధించి రానున్న పది రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పులివెందుల మండలం కొత్తపల్లె గ్రామానికి చెందిన బాలాప్రసాద్‌కు 5ఎకరాల పొలం ఉంది. ఆయన తల్లిదండ్రులు ఎకరా రూ.60వేలు పెట్టి కొనుగోలు చేశారు. గతంలో వర్షాధార భూములు కావడంతో కంది, జొన్న, వేరుశనగ పంటలు సాగు చేసేవాడు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక కాలువలకు నీరు రావడం, డ్రిప్ పరికరాలతో సులభతరంగా పంటలు సాగుచేస్తున్నారు. వాణిజ్య పంటలైన అరటి, మిరప, టమోటా సాగు చేస్తూ గణనీయంగా ఆదాయం గడిస్తున్నారు. గతంలో ఎకరం రూ.1లక్షలోపు ఉన్న పొలం ప్రస్తుతం రూ.10 నుంచి 15లక్షలు విలువ చేస్తోందని బాలాప్రసాద్ తెలిపారు.



వీరపునాయునిపల్లె మండల వ్యాప్తంగా రైతులు వర్షాధారిత పంటలు మాత్రమే పండించుకోవాల్సిన పరిస్థితి. మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి జీఎన్‌ఎస్ఎస్ పథకంలో భాగంగా సర్వరాయసాగర్ ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా ఆ ప్రాజెక్టులో నీళ్లు నింపారు. భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. మండల వ్యాప్తంగా వాణిజ్య పంటల వైపు రైతులు దృష్టి సారించారు. అప్పట్లో ఎకరా రూ.50 వేల నుంచి 1లక్ష లోపు ఉన్న భూమి ధర ప్రస్తుతం ఆకాశాన్ని అంటింది. ఎకరం రూ.20 లక్షలు పలుకుతోంది. భూముల ధరలు పెరగడానికి వైఎస్ కుటుంబమే కారణమని గడ్డంవారిపల్లెకు చెందిన నర్రెడ్డి నందకుమార్‌రెడ్డి అనే రైతు తెలిపారు.



గండికోట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కాకముందు ఎకరం భూమి కొండాపురం మండలంలో రూ.2లక్షలకు లభించేంది. వర్షాధారం పంటలపైన్నే అక్కడి రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి. నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా గండికోట రిజర్వాయర్ నీళ్లు ఉండడంతో భూగర్భ జలాలు 20 అడుగుల్లోనే ఉన్నాయి. చీనీ తోటలు ఎండిపోయాయన్న మాట లేదు. 8ఎకరాల్లో చీనీ తోటలు పెట్టా, మంచి దిగుబడులు సాధించానని కెరామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సివి ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆరేళ్ల కిందట బోరుబావుల్లో నీళ్లు లేక చాల కష్టాలుపడ్డామని చెబుతున్నారు. మా గ్రామంలో ఎకరం రూ.15లక్షలు భూమి ధర ఉందని వివరిస్తున్నారు.



మా భూమి... బంగారం

- వైఎస్సార్ జిల్లా సమగ్రాభివృద్ధి.. భూముల ధరలకు రెక్కలు
- సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, పరిశ్రమల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెరిగిన భూముల ధరలు

సాక్షి ప్రతినిధి, కడప : ఒకప్పుడు కరువు ప్రాంతం. సాగునీటి సంగతి అటుంచితే, గుక్కెడు మంచినీళ్లు దొరక్క గొంతులు ఎండిపోయేవి. వరుణుడి కరుణ కోసం గ్రామీణులు కప్పాళమ్మను నెత్తిన పెట్టుకొని ఇళ్లిళ్లు తిరిగి పూజలు చేసేవారు. అలా చేస్తే వర్షం కురుస్తోందనే ప్రగాఢ నమ్మకం. జిల్లాలో వర్షపాతం అంతంత మాత్రమే ఉండేది. నీళ్లు లేక భూములు బీళ్లుగా దర్శనమిచ్చేవి. భూములు అమ్ముదామన్నా కొనుగోలు చేసేవారు కరువు. మరోవైపు మౌలిక వసతుల లేమితో పారిశ్రామికాభివృద్ధిలో జిల్లా వెనుకపడింది. ఇప్పుడు ఆ పరిస్థితికి భిన్నంగా ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జిల్లా అభివృద్ధికి బాటలు వేశారు. కరువును పారదోలే ప్రయత్నంలో సఫలీకృతుడయ్యారు. 'కృష్ణా జలాలను వెనుకపడిన రాయలసీమలో పారిస్తే నా జన్మ ధన్యమని' బాహాటంగా ప్రకటించారు. అనుకున్నట్లే సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకున్నారు. తర్వాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొలువుదీరాక వైఎస్సార్ జిల్లాలో సంక్షేమంతోపాటు అభివృద్ధి పరుగులు పెట్టించారు. మరోవైపు పారిశ్రామిక ప్రగతి సాధించారు. ఇంకోవైపు బద్వేలు, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కడప, కమలాపురం, పులివెందుల ప్రాంతాల్లో జీఎన్‌ఎస్ఎస్, తెలుగుగంగ, కేసీ కెనాల్ పరిధిలో పలు సాగునీటి ప్రాజెక్టులు నిండుకుండల్లా నీటితో కళకళలాడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికీ 46టీఎంసీలు నీరు నిల్వ ఉంది. ఆయకట్టుకు అటు ఖరీఫ్, ఇటు రబీలోనూ సాగునీరు అందిస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. వాణిజ్య పంటలు సాగు దిశగా రైతుల అడుగులు పడ్డాయి. పట్టెడన్నం సంపాదన కోసం ఎదురు చూస్తే రైతుకు కొనుగోలు శక్తి పెరిగింది. మరోవైపు జాతీయ రహదారులు జిల్లా మీదుగా వచ్చి చేరాయి. గ్రీన్ ఫీల్డ్ హైవేలు ఏర్పాటుకు సైతం ఆచరణలో అడుగులు పడ్డాయి. కొప్పర్తి పారిశ్రామికవాడలో ఎలక్ట్రానిక్ మ్యాన్‌ఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటైంది. ఇప్పటికే ఆల్‌డిక్సన్ కంపెనీ ప్రారంభమైంది. గోపవరంలో సెంచురీ ప్లైబోర్డ్స్ అందుబాటులోకి వచ్చింది. జమ్మలమడుగు ప్రాంతంలో జెఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ మొగ్గ తొడుగుతోంది. రూ.725 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి పర్యావరణ అనుమతులు లభించాయి. ఒక్కమాటలో చెప్పాలంటే వైఎస్సార్ జిల్లా అన్నీ రంగాలల్లో అభివృద్ధి చెందింది. వెరసి భూముల ధరలకు రెక్కలొచ్చాయి.



కేసీ కెనాల్

ప్రధాన రహదారుల వెంబడి భూముల ధరలకు రెక్కలు...

జిల్లాలోని ప్రధాన రహదారులను జాతీయ రహదారులుగా మార్చారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లోని భూములకు డిమాండ్ పెరిగింది. ధరలు పెద్ద ఎత్తున పెరిగాయి. పులివెందుల, కమలాపురం, మైదుకూరు, రాయచోటి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులయ్యాయి. గ్రీన్ ఫీల్డ్ హైవే వచ్చి చేరాయి. మైదుకూరు ప్రాంతంలో రూ.25 నుంచి 30లక్షలు పలికే భూమి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రకటించిన తర్వాత రూ.2కోట్లు పలుకుతోంది. మరోవైపు రియల్ ఎస్టేట్ రంగం పుంజుకుంది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, పులివెందుల, బద్వేలు, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగు, రాయచోటి నియోజకవర్గాల పరిధిలో రియల్ ఎస్టేట్ వెంచర్లు పెద్ద ఎత్తున వెలిశాయి. కడప ప్రాంతంలోని వెంచర్లలో సెంటు రూ.7–15 లక్షలు పలుకుతోంది. ప్రొద్దుటూరు, బద్వేల్ ప్రాంతంలో రూ.5–10 లక్షలు, జమ్మలమడుగు, కమలాపురం, పులివెందుల ప్రాంతంలో రూ.4–12 లక్షలతో ప్లాట్లు విక్రయిస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో..

నాలుగేళ్లుగా జిల్లాలోని జీఎన్‌ఎస్ఎస్, కేసీ కెనాల్, తెలుగుగంగ పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రభుత్వం నీటితో నింపింది. ఆయకట్టుకు ఖరీఫ్, రబీలోనూ సాగునీరు అందుతోంది. రైతులు వాణిజ్య పంటలైన అరటి, మిర్చి, చీనీ, బత్తాయి, జామ, డ్రాగన్ ఫ్రూట్, ఉల్లి, కూరగాయల పంటలను పండిస్తున్నారు. భూములు కొనుగోలు చేసేవారు ఉన్నారు, కానీ అమ్మేవారు లేకపోవడంతో ధరలు బాగా పెరిగాయి. ఇతర నగరాలకు చెందిన వారు జిల్లా సమగ్రాభివృద్ధి పట్ల అంచనా వేసి భూములపై పెట్టుబడులు పెట్టుతున్నారు. గతంలో ఎకరం రూ.2 లక్షలు ధర పలికిన భూములు ఇప్పుడు రూ.15–20 లక్షలు పలుకుతుండడం గమనార్హం. జీఎన్‌ఎస్ఎస్ పరిధిలోని పైడిపాలెం, చిత్రావతికి నీరు లభించిన తర్వాత పులివెందుల నియోజకవర్గంలో సగటున ఎకరం రూ.18లక్షల వరకూ పలుకుతోంది. మైలవరం పరిధిలో గతంలో రూ.2 లక్షలు ఉన్న ఎకరా భూమి ధర ప్రస్తుతం రూ.15 లక్షలకు తక్కువ లేకుండా ఉంది. వామికొండ, సర్వరాయసాగర్ ప్రాజెక్టు ప్రాంతాలల్లో ఎకరం రూ. లక్ష ఉన్న భూమి ఇప్పుడు రూ.15 లక్షలు తక్కువ లేకుండా ఉంటోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

కడప సెవెన్‌రోడ్స్: పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, కుటుంబ భద్రత, సంక్షేమం కోసం సఫాయి కరంచారీ జాతీయ కమిషన్ నిరంతరం పాటుపడుతోందని సఫాయి కర్మచారీస్ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేషన్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ విపత్కర సమయంలో పారిశుధ్య కార్మికులు సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివి అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్వచ్ఛ భారత్ మిషన్'సఫలీకృతంలో వీరి పాత్ర ఎంతో ఉందన్నారు. సఫాయి కర్మచారీస్ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేసి..వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తోందన్నారు. జాతీయ స్థాయిలో 'నేషనల్ సఫాయి కర్మచారీస్ ఫైనాన్స్ డెవలప్ మెంట్ కార్పొరేషన్'ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల ఆర్థికాభివృద్ధి కోసం రుణాలు కూడా అందిస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భారత్'పథకం ద్వారా రూ.5 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ, 'ఆవాస్ యోజన'ద్వారా హౌసింగ్ పథకాలు అమలు చేస్తోందన్నారు.

- కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ సఫాయి కరంచారీ కార్మికుల సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. తొలుత జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకు చెందిన పారిశుధ్య కార్మికులు హాజరై వృత్తి పరంగా, ఆర్థికంగా ఎదుర్కొంటున్న సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్, కడప నగర కమీషనర్ ప్రవీణ్ చంద్, ఏఎస్పీ తుషార్ డూడీ, శిక్షణా కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సఫాయి కర్మచారీస్ జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేషన్

ఒంటిమిట్ట రామయ్య సేవలో..

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామివారిని శుక్రవారం సఫాయి కర్మచారీ జాతీయ కమిషన్ చైర్మన్ ఎం. వెంటేశన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికి, పూజలు నిర్వహించారు.

రాష్ట్రవ్యాప్తంగా నగరవనాలు

రాజంపేట: నిత్యం ఒత్తిడితో గడిపే నగరవాసికి ఆహ్లాదం పొందేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నగరవనాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(పీసీసీఎఫ్) వై.మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాజంపేట రేంజ్ పరిధిలోని ఎస్ఆర్ పాళెం సమీపంలో ఏర్పాటుకానున్న నగరవనాన్ని ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనువాసులు, జెడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలు అటవీ అందాలను వీక్షించేలా ప్రతి పట్టణ ప్రాంతాలకు దగ్గరలో వీటిని ఏర్పాటు చేయాలన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి, పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో నగరవనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

- రాజంపేటలో రూ.2కోట్లతో నగరవనాన్ని సుందరంగా తీర్చిద్దిందేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని పీసీసీఎఫ్ వై.మధుసూధనరెడ్డి అన్నారు. ఎమ్మెల్యేలు జెడ్పీచైర్మన్‌లు మాట్లాడుతూ పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న నగరవనం భవిష్యత్తులో పట్టణవాసులకు అందుబాటులోకి వస్తుందన్నారు. కర్నూలు సీసీఎఫ్ ఎం.నాగేశ్వరరావు, అన్నమయ్య,వైఎస్సార్ జిల్లాల్ల అటవీఅధికారులు సందీప్,వివేక్ పాల్గొన్నారు.

మరో రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు చేయండి

కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ జిల్లాలో మరో రెండు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేయాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన కేంద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్యకు చిరునామాగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో చేరేందుకు విద్యార్థులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంపీల కోటాను నిలుపుదల చేశారని గుర్తు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ వ్యాప్తంగా 50 కొత్త కేంద్రీయ విద్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో వైఎస్సార్ జిల్లాలోని పులివెందుల, ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్రమంత్రిని కోరారు. ఇక్కడ యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ప్రాజెక్టు ఉన్న దృష్ట్యా వేల సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారి పిల్లలకు ఈ కేంద్రీయ విద్యాలయాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు.

మైదుకూరులో కేపీ ఉల్లి రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు వినతి

జిల్లాలోని మైదుకూరులో కేపీ ఉల్లి(రోస్ ఆనియన్) రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖామంత్రి నరేందర్ సింగ్ తోమర్‌కు ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేపీ ఉల్లిని రాయలసీమ ప్రాంతంలో ఎక్కువగా , కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లో పండిస్తారన్నారు. ఇంటర్నేషనల్ మార్కెట్‌లో వీటికి ఎక్కువ డిమాండ్ ఉందని, మలేషియా, సింగపూర్, హాంగ్‌కాంగ్, శ్రీలంకలకు ప్రతి ఏడాది కేపీ ఉల్లి ఎగుమతి అవుతూ ఉంటుందనానరు. మైదుకూరు నియోజకవర్గంలో కేపీ ఉల్లిని ఎక్కువగా పండిస్తారని, ఇక్కడ కేపీ ఉల్లి రీసెర్చ్ సెంటర్ నెలకొల్పితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రీసెర్చ్ సెంటర్‌కు అవసరమయ్యే భూమిని కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

సున్నావడ్డీతో ఆర్థిక ప్రగతి

జిల్లాలో 37,576 స్వయం సహాయక సంఘాలకు రూ.57.48 కోట్లు విడుదల

కడప సెవెన్‌రోడ్స్: మహిళా సాధికారతే ధ్యేయంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళల్లో ఆర్థిక భరోసాను నింపేందుకే వైఎస్ఆర్ 'సున్నా'వడ్డీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. శుక్రవారం అమలాపురం బహిరంగ సభ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2022–23 సంవత్సరానికి సంబంధించి స్వయం సహాయక సంఘాల మహిళలకు 'వైఎస్సార్ సున్నా వడ్డీ'పథకం లబ్ధి మొత్తాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ వీసీ హాలు నుండి డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, రాష్ట్ర ఉద్యాన సలహాదారు శివప్రసాద్ రెడ్డి, మెప్మా పీడీ సురేష్‌రెడ్డి, మిషన్ శక్తి స్టేట్ ఎక్సిక్యూటివ్ మెంబర్ మూలే సరస్వతి తదితరులు హాజరయ్యారు. వీసీ అనంతరం జిల్లాలోని పట్టణ, గ్రామీణ పరిధిలో 37,576 సంఘాల్లోని 399795 మంది సభ్యులకు మంజూరైన రూ.57.48 కోట్లు మొత్తాన్ని లబ్ధిదారులకు మెగా చెక్కు రూపంలో అందజేశారు.



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, రాష్ట్ర ఉద్యాన సలహాదారు శివప్రసాద్‌రెడ్డి తదితరులు

సీఎం సాయం వెలకట్టలేనిది



ఆడపడుచులను కష్టాల నుంచి గట్టెక్కించడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న సాయం వెలకట్టలేనిది. ఈ ప్రభుత్వంలో మహిళలను మహారాణులుగా మార్చారు. వైఎస్ఆర్ సున్నా వడ్డీ, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా వంటి పథకాల ద్వారా మహిళలను ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులేస్తున్నారు. ప్రభుత్వం సున్నా వడ్డీ ద్వారా అందించిన 26 వేలు సాయంతో చీరెల వ్యాపారం చేస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తున్నాను. - అవ్వారు శాలిని, కడప

మహిళలకు పెద్దపీట



మహిళలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్న రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేం. నేను చీరల వ్యాపారం, టైలరింగ్ ద్వారా ఉపాధి పొందుతున్నాను.కరోనా కష్టకాలంలో బ్యాంకు రుణాలు కట్టేందుకు ఇబ్బందులు పడ్డాం. రుణాల వడ్డీని ప్రభుత్వమే భరించడం సంతోషదాయకం. - జీ.సుశీల, కడప

సంక్షేమ పథకాలు అందుకుంటున్నాం



మా కుటుంబం ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను అందుకుంటోంది. నేను ఇంట్లోనే టైలరింగ్ పని చేసుకుంటున్నాను. వైఎస్ఆర్ సున్నా వడ్డీ ద్వారా మా సంఘంలో మహిళలందరికీ ఆర్థిక సాయం అందింది. జగనన్న పది కాలాలు చల్లగా ఉండాలి. - షేక్ ముబీన, కడప

మాట నిలబెట్టుకున్న సీఎం



పొదుపు సంఘాల నిరుపేద మహిళలకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ఒక వరం. మహిళల ఆర్థిక సాధికారత కోసం జగనన్న చేస్తున్న కృషి అభినందనీయం. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, మహిళలకు అండగా ఉండటం మా అదృష్టం. మాట తప్పని ముఖ్యమంత్రిగా జగనన్న చరిత్రలో నిలుస్తారు. - ఎర్రమాసు లత, కడప

జిల్లాలో అంతటా వర్షం

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు వర్షం కురిసింది. పులివెందుల, లింగాల, వేమలు, వేంపల్లి మినహా జిల్లా అంతటా వర్షం కురిసింది. సింహాద్రిపురంలో అత్యధికంగా 41.6 మిల్లీమీటర్లు, కొండాపురం అత్యల్పంగా 0.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మండలం	నమోదైన వర్షం (మి.మీలో)	మండలం	నమోదైన వర్షం (మి.మీలో)
పెద్దముడియం	36.0	ప్రొద్దుటూరు	14.8
దువ్వూరు	32.2	కమలాపురం	13.6
రాజుపాలెం	31.6	బి.కోడూరు	13.2
తొండూరు	30.6	వీఎన్‌పల్లి	11.4
మైదుకూరు	30.0	ఖాజీపేట	10.6
ఎర్రగుంట్ల	26.4	చక్రాయపేట	8.0
చాపాడు	25.4	వల్లూరు	3.6
సిద్దవటం	25.2	జమ్మలమడుగు	3.4
సికెదిన్నె	24.8	కాశినాయన	3.0
కడప	24.2	పోరుమామిళ్ల	2.2
పెండ్లిమర్రి	21.2	ఒంటిమిట్ట	2.0
కలసపాడు	19.0	బద్వేల్	1.0
చెన్నూరు	17.6	గోపవరం	0.8
బిమతం	16.2	కొండాపురం	0.2

సీపీఎస్ జిల్లా కన్వీనర్ ఎన్నిక

ప్రొద్దుటూరు : ఏపీఎస్‌టీఎఫ్‌కు సంబంధించి సీపీఎస్ జిల్లా కన్వీనర్‌గా మైదుకూరు నరేష్‌ను ఎన్నుకున్నట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు బి.విద్యాసాగర్ తెలిపారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం ఏపీఎస్‌టీఎఫ్ జిల్లా ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి గంటా రామ్మోహన్, పట్టణ గౌరవాధ్యక్షుడు హరే రామకృష్ణ, అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ కుమార్, లక్ష్మి చౌడయ్య, నాయకులు రాధా లక్ష్మి, అరుణ, జాకీర్, జోసెఫ్, గురువయ్య, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అట్లూరు : మండల పరిధిలోని ముత్తుకూరు గ్రామానికి చెందిన మీసాలశ్యామ్ సుందర్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి వివరాల మేరకు.. గురువారం రాత్రి ముత్తుకూరు నుంచి తన ద్విచక్ర వాహనంలో బద్వేలుకు బయలుదేరాడు. వెంకటశెట్టిపల్లె మలుపు వద్దకు వెళ్లే సరికి బద్వేలు నుంచి కడప వైపు వెళుతున్న టిప్పర్ ఢీకొనడంతో శ్యామ్‌సుందర్ తీవ్ర గాయాల పాలయ్యాడు.

లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

మైదుకూరు : విద్యుత్ శాఖలో పని చేస్తూ విద్యుత్ చౌర్యానికి పాల్పడినందుకు తమ శాఖలోని లైన్ ఇన్‌స్పెక్టర్ బి.నారాయణరెడ్డిని సస్పెండ్ చేసినట్లు మైదుకూరు విద్యుత్ ఈఈ జీవీ రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఖాజీపేట మండలం ఏటూరు లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న నారాయణరెడ్డి మైదుకూరులో నివాసం ఉంటున్నాడని పేర్కొన్నారు. కొద్ది రోజుల కిందట విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో నారాయణరెడ్డి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నట్లు తేలిందన్నారు. వారి నివేదిక మేరకు నారాయణరెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఈఈ తెలిపారు.

అనుమానితులను విచారణ చేసిన పోలీసులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఓ స్వర్ణ దుకాణంలో శుక్రవారం జరిగిన ఘటన నేపథ్యంలో ముగ్గురు అనుమానిత మహిళలను పోలీసులు విచారణ చేశారు. సోలాపూర్‌కు చెందిన ముగ్గురు మహిళలు స్థానిక సిద్దవటం రోడ్డులోని ఓ స్వర్ణ దుకాణంలో ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఈ సమయంలో దుకాణంలో రెండు ఉంగరాలు కనిపించకపోవడంతో అనుమానంతో దుకాణ యజమాని పోలీసులకు సమాచారమిచ్చాడు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తుండగా.. రెండు ఉంగరాలు దుకాణంలోనే కింద పడిపోయి ఉన్నట్లు పోలీసులకు తెలిపారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

- ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా
- లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్‌కు రూ.13 లక్షల అందజేత


సీఎం సహాయ నిధి ఎల్‌ఓసీని అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి సహాయ నిధి.. నిరుపేదలకు వరమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్ బాషా అన్నారు. శుక్రవారం స్థానిక పాత మున్సిపల్ ఆఫీసు వద్దనున్న తన క్యాంపు కార్యాలయంలో కడప నగరం గౌస్ నగర్‌కు చెందిన షేక్ నజీర్ బాషా లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ శస్త్ర చికిత్స కోసం వారి కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.13 లక్షల ఆర్థిక సాయం కింద ఎల్‌ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రం ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల వెన్నంటి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద వాడిని ఆదుకోవడానికి ఆరోగ్యశ్రీ పథకం వర్తించని జబ్బులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందజేస్తున్నారని తెలియజేశారు. కడప నగరంలో ఈ నాలుగేళ్లలో రూ.8 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరైందన్నారు. ఇంత పెద్ద మొత్తంలో పేద ప్రజలకు సహాయం అందించడం గొప్ప విషయం అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఆరుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద లివర్ ట్రాన్స్ ప్లాంట్ చికిత్సకు ఒక్కొక్కరికి రూ.30 లక్షలు పైగా సాయం అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డ్ చైర్మన్ పులి సునీల్ కుమార్, కార్పొరేటర్లు జహీర్, షేక్ మహమ్మద్ షఫీ, అజ్మతుల్లా ఖాన్, నాయకులు బంగారు నాగయ్య యాదవ్, తోటక్రిష్ణ పాల్గొన్నారు.

ఇసుకకు టీడీపీ నేత వరద కప్పం వసూలు చేస్తున్నారు

- కామనూరులో ప్రజలకు ఓటు వేసే స్వాతంత్ర్యం కూడా లేదు
- అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తన స్వగ్రామంలో ఇసుకకు కూడా కప్పం వసూలు చేస్తుండటం దారుణమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. బయటి ప్రపంచానికి నీతులు బోధించే వరద, ఆయన కుటుంబీకులకు 30 ఏళ్ల నుంచి వారు చేస్తున్న దందా కనిపించడం లేదా అని అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి తదితరులు మాట్లాడుతూ వరద స్వగ్రామమైన కామనూరులో కుందూ నది ఇసుక (జలుగు) కోసం వెళితే ట్రాక్టర్‌కు రూ.300 చొప్పున దౌర్జన్యంగా కప్పం వసూలు చేస్తున్నారని తెలిపారు. గోపవరంలో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం నిర్మాణానికి అవసరమైన ఇసుకను కామనూరు నుంచే కప్పం కట్టి తెచ్చుకోవాల్సి వచ్చిందన్నారు. ఓ సందర్భంలో కార్యాలయ భవనాలకు ట్రాక్టర్‌లో ఇసుక తెస్తుండగా పోలీసులు రూ.20 వేలు జరిమానా విధించారన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వరద, ఆయన సోదరుడు రాఘవరెడ్డి తమ గ్రామంలో ఉన్న కుందూ నదిని ఆక్రమించారన్నారు. రైతులతో సహా ఎవరు ఇసుక కోసం వెళ్లినా కప్పం చెల్లించాల్సి వస్తోందన్నారు. ఎందుకు ఈ విషయంపై అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఆ గ్రామం ఇప్పటి వరకు అభివృద్ధికి నోచుకోలేదని, తమ ప్రభుత్వంలో అభివృద్ధి చేస్తుంటే అడ్డుకుంటున్నారన్నారు. వరద స్వగ్రామంలో స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేవని అన్నారు. 1400 ఓట్లు ఉన్న ఆ గ్రామంలో ఇప్పటి వరకు ఏ ఎన్నికల్లో పోలింగ్ జరగలేదన్నారు. గ్రామస్తులను భయపెట్టి వేధిస్తున్నారని తెలిపారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కూడా వారికి పోటీగా ఉన్నారని, ఇళ్లపైకి వెళ్లి దాడులు చేశారన్నారు. తాను అన్నింటా నిక్కచ్చిగా ఉన్నానని, భారతీయుడు తరహాలో మాట్లాడే వరదకు తమ గ్రామంలో జరుగుతున్న నిర్వాకం కనిపించలేదా అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడం తగదని తెలిపారు. ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి కప్పం వసూలును అడ్డుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. ఎన్నికల కమిషన్, పోలీసు అధికారులకు, రెవెన్యూ అధికారులకు ఈ సమస్యలు ఎందుకు కనిపించడం లేదన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాందేడ్–విల్లుపురం మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నాందేడ్–విల్లుపురం (07415/16) మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీలలో ఈ రైలును నడుపుతున్నారన్నారు. 12వ తేదీ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నాందేడ్‌లో బయలుదేరి కడపకు మరుసటి రోజు ఉదయం 5.45 గంటలకు చేరుకుని మధ్యాహ్నం 1.30 గంటలకు విల్లుపురం వెళుతుందన్నారు. తరువాత విల్లుపురంలో అదే రోజు సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి కడపకు అర్ధరాత్రి 12.28 గంటలకు చేరుకుని సాయంత్రం 5.45 గంటలకు నాందేడ్‌కు చేరుతుందన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు ట్రిప్‌లు నడుపుతున్నారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ రైలు తిరుమన్నామలై, వేలూరు, కాట్పాడి, రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదగిరి, సేరం, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట, సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ స్టేషన్లలో ఆగుతుందన్నారు.

జోనల్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ

కడప స్పోర్ట్స్ : జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారిణులు మహిళల క్రికెట్‌లో సత్తా చాటుతున్నారు. ఇటీవల నిర్వహించిన అంతర్ జిల్లాల జోనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ వయో విభాగాల్లో జిల్లా జట్టులో రాణించడంతోపాటు సౌత్‌జోన్ జట్టుకు ఎంపికయ్యారు. ఇటీవల వెంకటగిరిలో నిర్వహించిన అండర్–15, అండర్–19, అండర్–23, సీనియర్ విభాగాల్లో రాణించారు. జిల్లా మహిళల క్రికెట్ విభాగం సమన్వయకర్తగా కళ్యాణదుర్గం విష్ణుమోహన్ రావు బాధ్యతలు చేపట్టిన అనంతరం రాణించడంపై జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్, జిల్లా క్రికెట్ సంఘం ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్.ఖాజామైనుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. అండర్–15 విభాగంలో ప్రశంస, అనురాధ, స్టాండ్‌బైలుగా శ్రీచందన, చైత్రలు ఎంపికయ్యారు. అండర్–19 విభాగంలో ప్రియాంకరెడ్డి, ప్రశంస, అండర్–23 విభాగంలో ఎ.శిరీష, ఎన్.శ్రీచరణి, కె.ఓబులమ్మ, కె.ప్రియాంకరెడ్డి ఎంపికయ్యారు. సీనియర్ విభాగంలో ఎ.శిరీష, ఎన్.శ్రీచరణి, ఎన్.మౌనిక, సి.వైష్ణవిలు ఎంపికై జోనల్ పోటీల్లో రాణించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని కోనేటికాల్వ వీధిలో రస్తా విషయమై ముత్యాలపాటి చంద్రశేఖర్ అనే వ్యక్తిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కేసులో శుక్రవారం జోసఫ్‌తోపాటు మేస్త్రీలను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ మంజునాథ్‌తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామని ఆయన పేర్కొన్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో లారీ బోల్తా

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్ రెండవ మలుపు వద్ద అంజనేయస్వామి గుడి సమీపాన శుక్రవారం యాసిడ్ లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పాండిచ్చేరి నుంచి హైదరాబాదు వెళుతున్న యాసిడ్ లారీ అదుపుతప్పి లోయలో పడింది. ప్రమాద సమయంలో లారీలో డ్రైవర్ ఒక్కడే ఉన్నాడు. అతనికి స్వల్ప గాయాలయ్యాయి.

విజిలెన్స్ దాడులు

కడప అర్బన్ : కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాష ఆదేశాల మేరకు కడప నగరంలోని విజయనగర్‌కాలనీలో కిరణ్ టిఫిన్ అండ్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను కడప విజిలెన్స్ అధికారులు, పౌరసరఫరాల సంస్థ డిప్యూటీ తహసీల్దార్ శుక్రవారం తనిఖీ చేశారు. 4 గృహ అవసర సిలిండర్‌లను వాణిజ్య అవసర నిమిత్తం వాడుతున్నట్లు గుర్తించారు. ఈ తనిఖీలో విజిలెన్స్ అధికారులైన ఇన్‌స్పెక్టర్ టి.రెడ్డెప్ప, ఏఈఈ కెవి కిశోర్, సీఎస్ డిప్యూటీ తహసీల్దార్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలోని ఎర్రగుంట్లలో ప్రకాష్‌నగర్‌లో హోసన్నా ప్రార్థనా మందిరం వద్ద ఎం. అశోక్, సలీం, చాంద్‌బాషలు చుట్టుపక్కల గ్రామాల నుంచి రేషన్ బియ్యంను సేకరించి వాహనాల్లో తరలించారు. వారి వద్ద నుంచి రూ.2,60,045 విలువైన 3095 కిలోల బియ్యంను, రెండు వాహనాలను సీజ్ చేశారు. ఈ దాడిలో ఎస్ఐ శేషగిరి, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ.బాలగంగాధర్‌రెడ్డి, ఎర్రగుంట్ల డి.టి పి.వి రమణారెడ్డి, రాణివనం సచివాలయం వీఆర్‌ఓ ఏ.భారతి, కానిస్టేబుళ్లు సుదర్శన్‌రెడ్డి, డి.హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బద్వేలు అర్బన్ : భర్త పెట్టే వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం బద్వేలు పట్టణంలో చోటు చేసుకుంది. తిరుపతి జిల్లా గూడూరు మండలం నెర్నూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం, క్రిష్ణమ్మల కుమార్తె అయిన పుంగనూరు సుగుణమ్మ (34)ను పట్టణంలోని రామాంజనేయనగర్‌కు చెందిన పుల్లయ్యకు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త కూలీ పనులు చేసుకుంటుండగా, సుగుణమ్మ ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుండేది. కొన్నేళ్ళ పాటు అన్యోన్యంగా సాగిన వీరి కాపురంలో మనస్పర్థలు మొదలయ్యాయి. మద్యానికి బానిసైన పుల్లయ్య తరచూ భార్యను వేధిస్తుండేవాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం సేవించి వచ్చిన పుల్లయ్య సుగుణమ్మతో గొడవ పడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కొన్ని గంటల తర్వాత కుటుంబ సభ్యులు గమనించి కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి వెళ్ళి మృతురాలి కుటుంబ సభ్యులను విచారించారు.

అనుమానాస్పద స్థితిలో..

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 6వ వీధిలో శాంతమ్మ (50) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గత మూడు రోజులుగా ఇంటి లోపలి నుంచి ఆమె బయటకు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా సంరక్షణ కార్యదర్శి సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలియజేశారు.

పొలతల దేవస్థానం అభివృద్ధికి కృషి


పొలతలలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : పొలతలలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలయంలో దేవదాయ శాఖ నిధులు రూ.1.74 కోట్లతో చేపట్టే భక్తుల వసతి గదుల పనులకు ఆయన శుక్రవారం భూమిపూజ చేశారు. ముందుగా మల్లేశ్వరస్వామి, పార్వతిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పొలతల క్షేత్రంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని చర్యలు చేపడుతామన్నారు. అన్ని వసతులు కల్పించి క్షేత్రాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కమలాపురం నియోజకవర్గంలోని దాదాపు 62 దేవాలయాలకు నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. వీఎన్‌పల్లెలో ఉన్న సంగమేశ్వర ఆలయంలో టీటీడీ కల్యాణ మండపానికి టీటీడీ శ్రీవాణి ట్రస్టు నిధులు విడుదల చేసిందన్నారు. నియోజకవర్గానికి ఇన్ని నిధులు ఇచ్చి సహకరించిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అలాగే దేవస్థానంలో చేపడుతున్న రాజగోపురం నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరగా, నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు

వేంపల్లె : క్యాంపస్ ఇంటర్వ్యూలలో ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు రూ.5.50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు వచ్చినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కె.సంధ్యారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక ఆర్కే వ్యాలీ క్యాంపస్‌లో మాపెల్ ల్యాబ్స్ సంస్థ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలను నిర్వహించింది. సీఎస్ఈ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు జరిపిటి చందు, మద్దినేని అనిల్‌కుమార్, ఉప్పరకోట ఆంజనేయులు, ఎం.జగన్ మోహన్‌రెడ్డి, చాకలి అనిల్‌కుమార్, పి.మోహన్ రాజు, జి.రవిచంద్ర, పి.మౌనికలు ఎంపికయ్యారు. తమ ట్రిపుల్ ఐటీ నుంచి 8 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఆర్జీయూకేటీ చాన్స్‌లర్ కె.చెంచురెడ్డి, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్, డైరెక్టర్ కె.సంధ్యారాణి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేసి, వారిని అభినందించారు.

రైతు సంక్షేమానికి కమిటీలు కృషి చేయాలి


మార్కెటింగ్‌శాఖ అధికారులతో సమీక్షిస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : రైతు సంక్షేమానికి మార్కెట్ కమిటీలు కృషి చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కడప మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో శుక్రవారం మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన మార్కెటింగ్ కమిటీ కార్యకలాపాలను ఆర్‌జేడీఎంను అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతు సంక్షేమం కోసం మార్కెట్ కమిటీలు చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, కమిటీ ఆదాయ వనరులపై చర్చించారు. మార్కెట్ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం చేపట్టవలసిన ఇతర కార్యక్రమాలపై అధికారులతో చర్చించి ప్రభుత్వానికి తెలియచేయుటకు ప్రతిపాదలను తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు రామాంజనేయులు, ప్రాంతీయ ఉప మార్కెటింగ్ సంచాలకులు శ్రీకాంత్‌రెడ్డి, కడప ఏడీఎం ఆజాద్‌వల్లి, మార్కెటింగ్‌శాఖ డీఈ సంపత్‌బాబు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ బంగారు నాగయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ నికరలాభం రూ.9543 కోట్లు


మాట్లాడుతున్న ఎల్‌ఐసీ ఎస్‌డీఎం గిరిధర్

కడప కల్చరల్ : ఎల్‌ఐసీ సంస్థ 2023 జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో 9543.71 కోట్ల రూపాయల లాభాలను సాధించిందని ఆ సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ తెలిపారు. 2023–24 తొలి త్రైమాసిక ఫలితాలు విడుదలైన సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 2022తో పోల్చినపుడు ఎల్‌ఐసీ తాజాగా సాధించిన లాభాలు 198 శాతం అధికమని పేర్కొన్నారు. ఇదే కాలంలో ఎల్‌ఐసీ 4.61 శాతం మేర వ్యక్తిగత బీమాలో వృద్ధి సాధించిందని తెలిపారు. పాలసీ తీసుకున్నాక దాని కొనసాగింపును పర్సిస్టెన్సీ పేరుతో లెక్క కడతామని, అలాంటపుడు ఎల్‌ఐసీ ప్రీమియంల పర్సిస్టెన్సీలో మంచి పెరుగుదల ఉందని చెప్పారు. ఇది ఎల్‌ఐసీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని, సేవల పట్ల సంతృప్తిని తెలుపుతోందని వివరించారు. ఎల్‌ఐసీ ఆస్తుల విలువ జూన్ 2022 నాటికి 41.02 లక్షల కోట్లు కాగా, 2023 నాటికి 46.11 లక్షల కోట్లకు చేరిందన్నారు. పాలసీదారుల నిధులను పెట్టుబడులుగా పెట్టగా, జూన్ 2022 త్రైమాసికంలో 7.74 శాతం రాబడి వచ్చిందని, అదే జూన్ 2023లో 8.78 శాతం రాబడి వచ్చిందని, ఎల్‌ఐసీ లాభాలు నిలకడగా పెరుగుతున్నాయని వివరించారు. ప్రజలు, పాలసీదారుల విశ్వాసం కారణంగానే 2023 జూన్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు.

ఎఫ్‌పీఓలను నడపటానికి ముందుకు రావాలి


రుణపత్రాలను అందజేస్తున్న డీసీసీ బ్యాంకు సీఈఓ, నాబార్డు బీడీఎం

కడప అగ్రికల్చర్ : రైతులు కష్టపడి పండించిన పంటను దళారులు కొనుక్కొని ఎక్కువ రేటుకు అమ్ముకుని లబ్ధి పొందుతున్నారని, ఈ వ్యవస్థకు చెక్ పెట్టేందుకు రైతు ఉత్పాదక సంఘాలు(ఎఫ్‌పీఓ) ముందుకు రావాలని డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. నాబార్డు వారి సౌజన్యంతో సీటీఐ, ఆప్కాబ్ వారు కడపలోని డీసీసీ బ్యాంకు హెడ్ ఆఫీసులోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్లుకు, హెడ్ ఆఫీసులో పని చేస్తున్న మేనేజర్లకు రైతు ఉత్పాదక సంఘాలు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, ఎన్ఎల్‌ఎం రుణాలపై అవగాహన కల్పించడానికి ఒక రోజు వర్కుషాపు జరిగింది. దీన్ని నాబార్డు డీడీఎం విజయవిహారి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొన్ని ఎఫ్‌పీఓలకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్‌పీఓలకు సపోర్టు చేయడానికి కడప డీసీసీ బ్యాంకు ముందుకు రావడం సంతోషించాల్సిన విషయం అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ జిల్లాలో మైదుకురు ప్రాంతంలో టమాట అధికంగా పండుతుందని, ధర తక్కువగా ఉన్నప్పుడు డ్రై చేసి పచ్చళ్లకు, సాస్ మొదలకు వాటిని తయారు చేయడం వల్ల రైతుకు అధిక లాభాలు వచ్చేటట్లు ఎఫ్‌పీఓ పని చేయవచ్చని అన్నారు. హైదరాబాదు సీటీఐ, ఆప్కాబ్ నుంచి వచ్చిన సీనియర్ ఫ్యాకల్టీ విజయచంద్రారెడ్డి, బ్రహ్మానందరాజులు రైతు ఉత్పాదక సంఘాలకు పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ, ఎన్ఎల్‌ఎం రుణ సౌకర్యాలపై కడప డీసీసీ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్లకు, ఇతర ఇబ్బందికి అవగాహన కల్పించారు.

అధికార దుర్వినియోగం చేసిందని చెప్పడం అవివేకం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేసిందని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి చెప్పడం అవివేకమని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.చంద్రఓబుళరెడ్డి, ఎంపీపీ లక్ష్మీగాయత్రిలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని ఇడుపులపాయ, టి.వెలమవారిపల్లె గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యులకు రాష్ట్ర ఎన్నికల అధికారి నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఎన్నికలలో పోటీ చేయాలనే చిత్తశుద్ధి ఉంటే ఇడుపులపాయ సర్పంచ్ స్థానానికి మాత్రమే నామినేషన్ వేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఎన్నికలలో పోటీ చేయాలన్నది ఏ రాజకీయ పార్టీకైనా మొదటి ప్రాధాన్యత ఉంటుందని, కానీ టీడీపీ నాయకులు కేవలం ఇడుపులపాయ సర్పంచ్‌కు మాత్రమే నామినేషన్ దాఖలు చేశారన్నారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి సోమశేఖరరెడ్డి ఇడుపులపాయ గ్రామ పంచాయతీకి సంబంధించి వైఎస్సార్‌సీపీ సర్పంచ్ అభ్యర్థిగా తుమ్మలూరు నాగమ్మ, 1వ వార్డు సభ్యునిగా శ్రీరాములు నామినేషన్ పత్రాలను పరిశీలించి ఆమోదించడం జరిగిందన్నారు. అయితే టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా పెద్దింటి లక్షున్న నామినేషన్ పత్రాలు పరిశీలించగా.. అదులో తప్పుగా ఉండటంతో అధికారులు వాటిని తిరస్కరించారన్నారు. అందుకు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో తిరస్కరించారని టీడీపీ నాయకులు బీటెక్ రవి అధికారులపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. కులధ్రువీకరణ పత్రం, ఇంటి పన్ను తదితర వాటికి సంబంధించిన పత్రాలను ఇవ్వడంలో అధికారులు ఆలస్యం చేశారని ఆరోపిస్తూ.. అధికారులపై మండిపడటం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కార్యక్రమంలో హజ్ హౌస్ కమిటీ డైరెక్టర్ మునీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కోసం స్థలం వితరణ

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని క్రిష్ణాపురం మండల ప్రాథమికోన్నత పాఠశాలను ఇటీవల ప్రభుత్వం ఉన్నతీకరణ గావించి ఉన్నత పాఠశాలగా మార్చింది. ఇందుకు సంబంధించి నూతన గదుల నిర్మాణం కోసం స్థలం తక్కువగా ఉండటంతో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ నరేన్ రామాజంనేయరెడ్డిల సహకారంతో తాడిగొట్ల పంచాయతీకి సంబంధించిన 33 సెంట్ల స్థలాన్ని విద్యాశాఖకు వితరణగా ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం పంచాయతీ వారు వైఎస్సార్ జిల్లా డీఈఓ పేరుపైన కడప రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాఘవరెడ్డి, హెడ్‌మాస్టర్ సుధాకర్‌రెడ్డి, స్కూల్ అసిస్టెంట్ బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.